ప్రలోభాలపై ప్రత్యేక నిఘా

- వాటి వెనుక ఎవరు ఉన్నారో గుర్తించడంపై దృష్టి
- 35 సమస్యాత్మక నియోజకవర్గాలు గుర్తింపు
- 50 వేలకు మించి నగదు తీసుకెళ్తే పత్రాలు కావాలి
- ఎన్నికల నిర్వహణకు 65 వేల బలగాల వినియోగం
- ఈవీఎం తరలించే ప్రతివాహనానికీ జీపీఎస్ ట్రాకర్
- పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ వచ్చి ఓటేయాలి
- సోషల్ మీడియాలో ప్రచారం ఎన్నికల ఖర్చులోకే
- సోషల్ మీడియాలో హద్దు దాటితే చర్యలు

'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. ప్రలోభాలపై ప్రత్యేక నిఘా పెట్టామని, డబ్బు, మద్యం, గిఫ్టులు వంటివి పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఒక వేళ పట్టుబడితే వాటిని తరలించినవారితో పాటు వాటివెనుక ఎవరున్నారో గుర్తించడంపై దృష్టిపెట్టినట్టు వెల్లడించారు. వికాస్‌రాజ్ శుక్రవారం 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పోలింగ్ రోజును సెలవు రోజుగా పరిగణించవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

పోలింగ్ డే సెలవు కాదు, బాధ్యత

రాష్ట్రంలో గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన 29 నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు వికాస్‌రాజ్ తెలిపారు. ఇందులో 24 నియోజకవర్గాలు గ్రేటర్ పరిధిలో ఉన్నాయని చెప్పారు. ఆయా చోట్ల ఈ దఫా పోలింగ్‌శాతం పెంచేందుకు కార్యాచరణ రూపొందించినట్టు చెప్పారు. ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. 'పోలింగ్ రోజును సెలవు రోజుగా చూడొద్దు' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలింగ్‌రోజు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు ఇచ్చింది ఇంటివద్ద ఉండటానికి కాదని, బాధ్యతగా వచ్చి ఓటేయడానికేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేయాలని పిలుపునిచ్చారు.

'కింగ్‌పిన్స్'పై దృష్టిపెట్టాం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా వాహనాల తనిఖీల ప్రక్రియ కొనసాగుతున్నదని వికాస్‌రాజ్ తెలిపారు. అనుమానాస్పదంగా తరలిస్తున్న డబ్బు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. వాటిని ఏయే మార్గాల్లో సేకరించారు? వీటి వెనుక ఎవరున్నారో (కింగ్‌పిన్స్) తెలుసుకోవడంపై దృష్టిపెట్టినట్టు వెల్లడించారు. ఇందు కోసం ఇంటెలిజెన్స్ వర్గాల సహాయం తీసుకుంటున్నామని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్‌పై కూడా దృష్టి సారించామని, ఆర్బీఐ, బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు. అనుమానిత లావాదేవీలపై సమాచారం అందిన వెంటనే పరిశీలిస్తామని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో అసత్య ప్రచారాలు చేయవద్దని సూచించారు. హద్దు దాటితే ఐటీ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభ్యర్థులూ జాగ్రత్త

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు తప్పకుండా నిబంధనలు పాటించాలని వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే అభ్యర్థుల ప్రచారశైలి, చేస్తున్న ఖర్చు వంటివాటిని ఎన్నికల పరిశీలకులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని చెప్పారు. వీడియో రికార్డింగ్ కూడా చేస్తామని, షాడోటీమ్స్‌ను రంగంలోకి దించుతామని వెల్లడించారు. సంప్రదాయ మీడియాతోపాటు సోషల్ మీడియాలో చేసే ప్రచారం కూడా ఎన్నికల ఖర్చులోకి వస్తుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరిగే ప్రచారంపై ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు. అభ్యర్థులు నామినేషన్ సమయంలోనే సంపూర్ణమైన, సరైన సమాచారం ఇవ్వాలని, లేదంటే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు.

35 సమస్యాత్మక నియోజకవర్గాలు

రాష్ట్రంలో 35 సమస్యాత్మక నియోజకవర్గాలను గుర్తించినట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. సమస్యాత్మకం అంటే కేవలం అల్లర్లు జరిగే నియోజకవర్గాలు కాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రాంతాలు, డబ్బు, మద్యం అధికంగా ప్రభావం చూపే ప్రాంతాలు, గతంలో ఎక్కువగా కేసులు నమోదైన ప్రాంతాలు, రాజకీయంగా, సామాజికంగా సున్నితమైన ప్రాంతాలు వంటివాటిని ఈ క్యాటగిరీలో చేర్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతానికి మత ఘర్షణల సమస్య ఎక్కడా లేదని, గతంలో ఇలాంటి సంఘటనలు నమోదైన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

65 వేల బలగాలతో రక్షణ

ఎన్నికల నిర్వహణకు మొత్తం 65 వేల బలగాలను వినియోగిస్తున్నట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. ఇందులో రాష్ట్రంలో 40 వేల బలగాలు ఉన్నాయని వివరించారు. పొరుగు రాష్ట్రాల నుంచి 20 వేల బలగాలు, కేంద్రం నుంచి 300 కంపెనీల బలగాలు కావాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు. ప్రస్తుతం 100 బలగాల వినియోగానికి అనుమతి వచ్చిందని తెలిపారు. ఎన్నికల నాటికి మిగతా బలగాలను కేటాయించే అవకాశం ఉన్నదని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టామని వివరించారు.

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

ఈవీఎం తరలింపు వాహనాలపై నిఘా

ఈవీఎంలను కచ్చితంగా ఆర్టీసీ బస్సుల్లోనే తరలించేలా ఏర్పాట్లు చేశామని వికాస్‌రాజ్ వెల్లడించారు. ఈవీఎంలు తీసుకెళ్లే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చుతున్నామని, తద్వారా ప్రతి వాహనం కదలికలపై నిఘా ఉంటుందని చెప్పారు. ఒకవేళ ఆయా వాహనాలు ఎక్కడైనా దారి తప్పినట్టు అనుమానం వస్తే వెంటనే రాష్ట్ర స్థాయిలోని కమాండ్ కంట్రోల్‌లో గుర్తిస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులు కూడా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లవద్దని, ప్రభుత్వం సమకూర్చిన అధికారిక వాహనాల్లోనే ప్రయాణించాలని ఆదేశాలు జారీచేసినట్టు వెల్లడించారు.

ఒకేరోజు పోలింగ్ బిగ్ టాస్క్

రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలన్నదే తమ అంతిమ లక్ష్యమని వికాస్‌రాజ్ చెప్పారు. ఒకే దఫాలో 119 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించడం 'బిగ్‌టాస్క్'గా అభివర్ణించారు. దాదాపు 20 విభాగాలకు చెందిన సిబ్బందిని ఒకేచోటికి చేర్చి, అందరినీ సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు నిర్వహించడం కఠిన పరీక్షేనని చెప్పారు. ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది సిబ్బందిని వినియోగిస్తున్నామని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లోని 150 పోలింగ్ స్టేషన్లకు సెల్‌ఫోన్ సిగ్నల్ రాదని గుర్తించామని, అక్కడ పోలీసుల సెట్స్ వాడటం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు.

నామినేషన్ల మరునాటి నుంచే ఓటర్ స్లిప్పులు

గతంలో వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని ఓటర్ స్లిప్పుల పంపిణీపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. నామినేషన్లు పూర్తయిన మరుసటి రోజు నుంచే ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని బీఎల్‌వోలను ఆదేశించామని చెప్పారు. ఈ ఏడాది కొత్తగా నమోదైన ఓటర్లకు నూతన ఓటర్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్డులు ఆకర్షణీయమైన రంగుల్లో, ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా లోగోతో ఉంటాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం తాగునీరు, నీడ, వృద్ధుల కోసం కుర్చీలు, ప్రత్యేక క్యూలైన్లు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, మూత్రశాలలు తదితర సదుపాయాలు కల్పిస్తామని వివరించారు.

'సీ విజిల్' ద్వారా ఫిర్యాదు చేయండి

ఎన్నికల ప్రచారం, పోలింగ్ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నవారిపై ప్రజలు నేరుగా తమకు ఫిర్యాదు చేయొచ్చని వికాస్‌రాజ్ చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'సీ విజిల్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. యాప్ ద్వారా ఇచ్చే ఫిర్యాదులు నేరుగా తమకు చేరుతాయని, వెంటనే చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. తమ ఓటు వివరాలు, పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకునేందుకు 'ఓటరు సహాయ మిత్ర', ఓటర్ హెల్ప్‌లైన్ పేర్లతో యాప్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రజలు రూ.50 వేలకు మించి నగదును తరలించవద్దని వికాస్‌రాజ్ సూచించారు. అంతకుమించి నగదు తీసుకెళ్లే వారు సంబంధిత పత్రాలు, రశీదులు వెంట తీసుకెళ్లాలని కోరారు. డబ్బును స్వాధీనం చేసుకోవడం వల్ల కొందరు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. జిల్లా స్థాయిలో ముగ్గురు సభ్యుల కమిటీని నియమించామని, వారికి సరైన పత్రాలు అందజేస్తే పరిశీలించి, డబ్బును విడుదల చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలు కొనసాగించాలా? వద్దా? అనేదానిపై ఇప్పటికే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని చెప్పారు. ఒకవేళ ఏదైనా అవసరం ఉంటే ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. బతుకమ్మ ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం ఇచ్చిన దరఖాస్తును కేంద్ర ఎన్నికల సంఘానికి పంపినట్టు వెల్లడించారు.

ఎలక్షన్ క్రి-థాన్ విన్నర్స్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఓటర్ల నమోదుకు ఆకర్షణీయమైన, స్ఫూర్తిదాయకంగా ఉండేలా పోస్టర్లు, వీడియోలు రూపొందించిన విజేతలను ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ శుక్రవారం ప్రకటించారు. ఎన్నికల సంఘం, హైసియా, కోడ్ తంత్ర సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన 'ఎలక్షన్ క్రి-థాన్ 2023' పోటీలో 1100 మంది పాల్గొన్నారు. ఇందులో విజేతలుగా పీ వరుణ్ సాయి, వెంకటేశ్ మంతెన, రాహుల్ నాయక్, పీ హరీశ్, ఎంఏ జావేద్ నిలిచారు. వీరికి రూ.20 వేల చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నారు. రన్నర్స్-కప్పు సుగుణ ఐశ్వర్య, అంకం శ్రీకాంత్, వీవీ కుసుమ్ ప్రియ, మహ్మద్ సాబీర్ ఎంపిక కాగా, వీరికి వీరికి రూ.10,009 చొప్పున ఇవ్వనున్నారు.

రేవంత్‌పై కేసు తిరిగి విచారణ

- రామేశ్వర్‌రావు పరువునష్టం కేసుపై హైకోర్టు తీర్పు
- మళ్లీ కాగ్నిజెన్స్ తీసుకోవాలని కింది కోర్టుకు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌పై మైహోం సంస్థల అధినేత రామేశ్వరరావు వేసిన పరువు నష్టం దావాను నిబంధనలకు అనుగుణంగా కాగ్నిజెన్స్ తీసుకోవాలని కింది కోర్టును హైకోర్టు ఆదేశించింది. చట్ట ప్రకారం తిరిగి విచారణ చేసి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కింది కోర్టుకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే కాగ్నిజెన్స్ తీసుకోవడాన్ని రద్దు చేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ ఉత్తర్వులు జారీచేశారు. డీఎల్ఎఫ్ భూముల వ్యవహారంపై 2014లో రేవంత్ చేసిన విమర్శల వల్ల తమ పరువుకు భంగం వాటిల్లిందని రామేశ్వర్‌రావు హైదరాబాద్ మేజిస్ట్రేట్ కోర్టులో రూ.90 కోట్లకు పరువు నష్టం దావా దాఖలు వేశారు. ఈ ఫిర్యాదును కింది కోర్టు విచారణ నిమిత్తం పరిగణనలోకి (కాగ్నిజెన్స్) తీసుకుని నోటీసులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని 2018లో రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కింది కోర్టు విచారణను నిలిపివేస్తూ గతంలోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఆ వ్యాజ్యం శుక్రవారం మరోసారి విచారణకు వచ్చింది. రేవంత్ న్యాయవాది వాదనలు విని పిస్తూ కాగ్నిజెన్స్‌లోకి తీసుకోడానికి నిర్దిష్టమైన కారణాలు చెప్పాలని, ఈ మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని గుర్తుచేశారు. లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ చేయకుండానే మేజిస్ట్రేట్ కాగ్నిజెన్స్ తీసుకోవడం చెల్లదని వాదించారు. ఈ వాదనలను రామేశ్వర్‌రావు తరపు న్యాయవాది వ్యతిరేకించారు. కింది కోర్టు కాగ్నిజెన్స్ తీసుకోవడం చట్టబద్ధమేనని వాదించారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు వాదిస్తూ, తాజాగా తిరిగి విచారణ చేపట్టేలా ఉత్తర్వులు ఇస్తే అభ్యంతరం లేదని తెలిపారు. కాగ్నిజెన్స్ నిర్ణయాన్ని దిగువ కోర్టుకు రిమాండ్ చేయాలని కోరారు. కాగ్నిజెన్స్ కారణాలు వెల్లడించేలా కింది కోర్టుకు అవకాశం కల్పించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తగిన కారణాలు పేర్కొంటూ కాగ్నిజెన్స్ తీసుకుంటున్నట్టు ఉత్తర్వులు ఉండాలని స్పష్టం చేసింది. అందుకే కాగ్నిజెన్స్ ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. మళ్లీ ప్రొసీడింగ్స్ నిర్వహించేందుకు కేసును కింది కోర్టుకు రిమాండ్ చేస్తున్నట్టు ప్రకటించింది.

తప్పుడు పత్రాలు సమర్పించిన ఆ ఇద్దరిపై క్రిమినల్ కేసు

- 'పైగా' భూముల వ్యవహారంలో హైకోర్టును కోరిన హెచ్ఎండీఏ

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో 49 ఎకరాల 'పైగా' భూముల విషయమై ఏకంగా న్యాయస్థానాన్నే మోసగించేందుకు ప్రయత్నించిన హైదరాబాద్ వాసులు యాహిరా ఖురేషీ, మహమ్మద్ మొయినుద్దీన్‌పై క్రిమినల్ కేసు నమోదుకు హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వాలని హెచ్ఎండీఏ కోరింది. ఈ మేరకు హెచ్ఎండీఏ దాఖలు చేసిన అఫిడవిట్‌తోపాటు ఆ ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. 'పైగా' భూముల వ్యవహారంలో హైకోర్టు 1998లో తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్టు తప్పుడు పత్రాలను సమర్పించారని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పైపెచ్చు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదంటూ అధికారులపై ధిక్కార పిటిషన్లు వేసినట్టు తెలిపారు. కాగా, ఆ ఇద్దరు వ్యక్తులు సమర్పించినవి బోగస్ పత్రాలేనని, వాస్తవానికి 'పైగా' భూములపై 1998లో ఎవరూ పిటిషన్లు వేయలేదని, కోర్టు కూడా ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేదని నిర్ధారిస్తూ హైకోర్టు రిజిస్ట్రీ నివేదిక సమర్పించింది. నిందితులపై క్రిమినల్ కేసు నమోదుకు ఉత్తర్వులివ్వాలని ఏజీ కోరారు. విచారణను నవంబర్ 3కు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

మూడు మృతదేహాలు.. పక్కన సైనైడ్ బాటిల్!

- అనుమానాస్పద స్థితిలో తండ్రీకూతుళ్లు మృతి
- భార్యపైనే అనుమానం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- బోయిన్‌పల్లిలో కలకలం

కంటోన్మెంట్, అక్టోబర్ 13: అందరూ నిద్రలేచి ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా ఓ ఇంట్లో నుంచి అరుపులు, కేకలు వినిపించాయి. వెంటనే అక్కడికి చేరుకున్న ఇరుగూపొరుగు ఆ ఇంట్లో పడిఉన్న మూడు మృతదేహాలను చూసి షాక్ అయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున ఓల్డ్ బోయిన్‌పల్లి భవానీనగర్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకున్నది. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ చారి (42) భవానీనగర్‌లో భార్య అక్షయ, కూతుర్లు స్రవంతి (8), శ్రావ్య (7)తో ఉంటున్నాడు. వృత్తిపనిలో గతంలో ఒక చేయి కోల్పోయిన శ్రీకాంత్‌చారి ఓ సిల్వర్ షాపులో పనిచేస్తాడు. శ్రీకాంత్‌చారి ఉంటున్న ఇంటికి సమీపంలోనే అతని తల్లి జయమ్మ ఓ గదిలో ఉంటుంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో సొంతగా వ్యాపారం చేయాలనుకున్న శ్రీకాంత్‌చారి తల్లి వద్ద రూ.10 లక్షలు అప్పుగా తీసుకుని ఇంట్లో పెట్టాడు. కొంత డబ్బు కనిపించకపోవడంతో భార్యాభర్తలకు గొడవలయ్యాయి. గురువారం ఉదయం కూడా భార్యతో గొడవపడ్డ శ్రీకాంత్‌చారి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగివచ్చాడు. భోజనం తర్వాత తల్లి తన గదికి వెళ్లిపోగానే భార్యాభర్తలు మళ్లీ అర్ధరాత్రి వరకు గొడవపడ్డారు. ఇంట్లో ఉన్న సైనైడ్‌ను అర్ధరాత్రి తర్వాత కూతుర్లకు తాగించి, తానూ సేవించినట్టు భావిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున భర్త, కూతుళ్లు మృతి చెంది ఉండటం చూసి అక్షయ తన అత్త జయమ్మకు చెప్పింది. ఘటనా స్థలంలో క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అక్షయ కనీసం ఏడవకపోవడం, మృతదేహాల పక్కన నిద్రమాత్రలు, మరో పక్క సైనైడ్ బాటిల్ ఉండటం, భర్త తనకు కూడా సైనైడ్ తాగించాలని చూశాడని అక్షయ చెబుతున్నదంటూ స్థానికులు ఆమెపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కొడుకులకు విషమిచ్చి తానూ ఉరేసుకొని..

- ఇద్దరు చిన్నారులు సహా ఉపాధ్యాయిని ఆత్మహత్య
- బోరబండలో ఘోరం

జ్యోతి(ఫైల్)

అర్జున్(ఫైల్).

ఆదిత్య(ఫైల్)

ఎర్రగడ్డ, అక్టోబర్ 13: పిల్లలు బుడిబుడి అడుగులేస్తుంటే చూడాలని ఏ తల్లి మనసు ఆరాటపడదు? బుచ్చిబుచ్చి మాటలను వింటూ కాలం గడపాలని ఏ అమ్మకు మాత్రం ఉండదు? కానీ తనకు ఆ భాగ్యం లేదనుకుంది! ఒక కొడుకు మాట్లాడలేడు, మరో కొడుకు నడవలేడు. ఈ వింత వైకల్యం తన సంతానానికే రావాలా.. అని ఆ మాతృహృదయం ఎంతగా మథనపడిందో! శుక్రవారం పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభమయ్యాయి విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లారు. ఆ ఉపాధ్యాయురాలు మాత్రం శాశ్వతంగా సెలవు పెట్టి తన ఇద్దరు కొడుకులతో సహా ఈ లోకం విడిచివెళ్లింది. ఈ హృదయ విదారక సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నది. రాజ్‌నగర్‌కు చెందిన విజయ్‌కుమార్, జ్యోతి (32) దంపతులకు అర్జున్ (4), ఆదిత్య (2) సంతానం. జ్యోతి బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్. ఆమె భర్త విజయ్‌కుమార్ సెంట్రింగ్ కాంట్రాక్టర్. వీరి పెద్ద కొడుకు అర్జున్ నడవగలడు కానీ మాట్లాడలేడు. చిన్న కొడుకు ఆదిత్య మాట్లాడగలడు కానీ నడవలేడు. తన ఇద్దరు పిల్లల పరిస్థితి గురించి ఆలోచిస్తూ జ్యోతి తరచూ బెంగపెట్టుకునేది. పలు దవాఖానాల్లో చికిత్స కోసం తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. దీంతో మనస్తాపానికి గురైన జ్యోతి శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పురుగుల మందు కలిపిన పాలను గ్లాసుతో కొడుకులకు తాగించింది. ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లగానే గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నది. ఎత్తుగా ఉన్న కిటికీకి చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పని మీద బయటకు వెళ్లిన విజయ్ ఇంటికి చేరుకున్నాడు. ముందు గదిలో కొడుకులిద్దరూ అచేతనంగా పడి ఉండటం చూసి షాక్‌కు గురయ్యాడు. భార్య లోపలి గదిలో కిటికీకి వేలాడుతూ కనిపించడంతో గుండెలు బాదుకున్నాడు. జ్యోతి తండ్రి వెంకటస్వామి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు ఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ చెప్పారు. జ్యోతి, విజయ్ దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని.. ఇద్దరు చిన్నారులను ప్రేమతో చూసుకునేవారని చుట్టుపక్కల వాళ్లు తెలిపారు. జ్యోతి, విజయ్‌లది మేనరికం వివాహమని తెలిసింది.

ఆదివాసీల జీవితాల్లో 'నోబుల్' వెలుగులు

- 19 ఏండ్లుగా అడవిబిడ్డలకు శిక్షణ
- 19 వేల మందికి ఉపాధి, ఉద్యోగాలు
- ఇప్పటివరకూ 20 పైలట్ ప్రాజెక్టులు
- హైదరాబాద్‌లో 'నోబుల్ ఎడ్యుకేషనల్ సొసైటీ' మరో ప్రాజెక్టు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఆదివాసీ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తెలంగాణ సర్కారు సంక్షేమ పథకాలకు ఓ స్వచ్ఛంద సంస్థ తోడు నిలుస్తున్నది. మారుమూల ఆదివాసీ, గిరిజన, చెంచు తండాల్లో జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రజల ప్రత్యేక అవసరాలను తీరుస్తూ సర్కారు లక్ష్యాలను నెరవేర్చేందుకు 'నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ' సంస్థ కలిసి నడుస్తున్నది. 2005లో ఏర్పాటైన ఈ సంస్థ ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో ఆయా వర్గాల కోసం 20కి పైగా ప్రాజెక్టులను నిర్వహించింది. దాదాపు 19వేల మందికి పైగా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో అనుసంధానంగా మెప్మా, డీఆర్డీవో, ఐటీడీఏ, సీపెడా, ఇగ్నో వంటి సంస్థల సహకారంతో ఆదివాసీలకు విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రవేశాలు కల్పించింది. 19 ఏండ్ల తన ప్రయాణాన్ని పూర్తిచేసుకొని, ఇప్పుడు హైదరాబాద్‌లో మరో ప్రాజెక్టును ప్రారంభించేందుకు సిద్ధమైంది.

డిజిటల్ లిటరసీలో శిక్షణ

డిజిటల్ లిటరసీ కల్పనలో భాగంగా కరీంనగర్, నారాయణపేట, వరంగల్, హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో లిటరసీ స్కూళ్లను ఏర్పాటుచేసింది. ప్రభుత్వ బడుల్లో 10 కంప్యూటర్ల చొప్పున ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించింది.

సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చే కోర్సులు

నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ద్వారా అనేక రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ నిర్వాహకుడు బీ సురేశ్‌కుమార్ తెలిపారు. సెక్యూరిటీ, వనబంధు, కల్యాణ యోజన, బీపీవో, నర్సింగ్, కాల్‌సెంటర్, టైలరింగ్, హాస్పిటాలిటీ, హ్యాండ్‌సెట్ రిపేరింగ్, కంప్యూటర్ ఆపరేటింగ్, బ్యూటీ పార్లర్, బ్యాంకింగ్ సెక్యూరిటీ, రిటైల్ మార్కెటింగ్, సీసీ కెమెరాల రిపేరింగ్ వంటి రంగాల్లో శిక్షణనిచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడులోనూ సంస్థ కార్యకలాపాలను కొనసాగిస్తున్నదని చెప్పారు. కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులను కర్ణాటక లోని గౌరీబిందుపూర్, చిక్‌బళ్లాపూర్, బీదర్, గుల్బర్గా, బస్వకల్యాణ్, శివమొగ్గ, ఒడిశా లోని బలారిపూర్, బల్లార్షా వంటి ప్రాంతాల్లో 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేసిందని అన్నారు. 19 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇదే స్ఫూర్తితో అక్టోబర్‌లో హైదరాబాద్ అంబర్‌పేట డివిజన్‌లో 40 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు.

ఎన్నికల అనుమతులకు సువిధ యాప్

సులభతర పద్ధతులను అమల్లోకి తెచ్చిన ఎన్నికల అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ నవంబరు 3వ తేదీ నుంచి మొదలవుతుంది. ఈ నామినేషన్ల ప్రక్రియలో గుర్తింపు పొంది రిజిస్ట్రేషన్ చేసుకున్న పార్టీల నుంచి అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు సులభమైన పద్ధతిలో ''సువిధ యాప్'' ద్వారా అనుమతులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మీటింగ్, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎలక్షన్ ఆఫీస్, లౌడ్ స్పీకర్, హెలికాప్టర్, హెలిప్యాడ్, డోర్ టు డోర్